సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం | 20 | జూలై | 2025



సుబ్బాలమ్మ తల్లికి అర కేజీ వెండి

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ తల్లికి చీర తయారీ నిమిత్తం పసుపులేటి మురళీ కృష్ణ, పద్మావతి దంపతులు శనివారం రూ.50 వేలకు పైగా విలువైన వెండి సమర్పించారు.




రక్తమోడిన రహదారి

ముమ్మిడివరం మండలం అన్నంపల్లి శివారు లక్ష్మీదేవిలంక వద్ద 216 జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు, మరో మహిళ దుర్మరణం పాలయ్యారు.

8లో

డెల్టాలకు 14,050 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 5 వేలు, మధ్య డెల్టాకు 2,350, పశ్చిమ డెల్టాకు 6,700 కలిపి మొత్తం 14,050 క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు. సముద్రంలోకి 49,422 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు

దేవరపల్లి: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి 8 నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కుండపోత వానలు కురిశాయి. అత్యధికంగా దేవరపల్లి మండలంలో 92.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చాగల్లులో 76.4, రాజమహేంద్రవరం అర్బన్ 60.6, నిడదవోలు 56.2, గోపాలపురం 40, రాజానగరం 22.6, కొవ్వూరు 20.8, సీతానగరం 11.4, కోరుకొండ 10, తాళ్లపూడి 8, నల్లజర్ల 5.4, రంగంపేట 3.6, రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 2.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని అధికారులు వివరించారు. జిల్లాలో సగటు వర్షపాతం 21.6 మిల్లీమీటర్లుగా నమోదైంది.

తపాలా సేవల్లో నూతన సాంకేతిక వ్యవస్థ

రాజమహేంద్రవరం సిటీ: మరింత మెరుగుగా తపాలా సేవలు అందించేందుకు రాజమహేంద్రవరం డివిజన్‌లో ఈ నెల 22 నుంచి కొత్తగా ఐటీ 2.0 సాంకేతిక వ్యవస్థ అమలు కానుందని పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లో ప్రస్తుతం ఉన్న రెండు ప్రధాన, 63 ఉప, 307 బ్రాంచి తపాలా కార్యాలయాల్లో ఈ నూతన సాంకేతికత అమల్లోకి రానున్నదన్నారు. దీనివలన పార్సిల్, సీఓడీ, వీపీపీ వంటి సేవల బట్వాడా వేగవంతమవుతుందన్నారు. ఉత్తరం ఎక్కడుందో పంపిన వారికి, చిరునామాదారుల మొబైల్ ఫోన్లకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతుందన్నారు. డిజిటల్ సంతకం, డిజిటల్ మోడ్ చెల్లింపుల వంటి ఆధునిక సదుపాయాలు కూడా వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయన్నారు. దీనికోసం డివిజన్‌లోని తపాలా కార్యాలయాల్లో వినియోగదారుల సేవలు సోమవారం పూర్తిగా నిలిపివేస్తున్నామని శేషారావు తెలిపారు.

లెక్చరర్ పోస్టుల రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి


సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న లెక్చరర్ పోస్టుల రాత పరీక్షకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సమన్వయ శాఖల అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పరీక్ష రెండు షిఫ్టుల్లో జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ జరిగే పరీక్షకు 519 మంది, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగే పరీక్షకు 240 మంది హాజరవుతారన్నారు. లూథర్‌గిరిలోని ఐ అండ్ డీజెడ్ కేంద్రంలో పరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టికెట్, తగిన గుర్తింపు పత్రంతో పరీక్షకు కనీసం 45 నిమిషాల ముందే అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేశారన్నారు.

శృంగార వల్లభుని ఆలయంలో రద్దీ

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతిలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల టికెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామికి రూ.2,50,679 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. సుమారు 3 వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

అపర సంజీవనికి.. తీస్తున్నారా ఊపిరి!

- ఆరోగ్యశ్రీని నీరుగార్చే దిశగా కూటమి సర్కారు అడుగులు
- ఆయుష్మాన్ భారత్‌గా మార్చేందుకు రంగం సిద్ధం
- ఇప్పటికే ఉద్యోగులకు ముగిసిన శిక్షణ
- కార్డుల రూపకల్పనకు శ్రీకారం
- 85 శాతం పూర్తి
- త్వరలో అమలుకు ప్రణాళికలు



సాక్షి, రాజమహేంద్రవరం: అపర సంజీవనిగా పేరొంది.. లక్షలాది మంది పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించి.. వారికి కొత్త ఊపిరి అందించిన అపూర్వ పథకం ఆరోగ్యశ్రీ. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రూపొందించిన ఈ పథకం.. ఎంతో మంది పేద, మధ్య తరగతి ప్రజలకు ఖరీదైన వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించింది. ఆ మహానేత తదనంతరం ఆయన తనయుడు, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం ఈ పథకాన్ని మరింత బలోపేతం చేశారు. అంతకు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీని దాదాపు నిర్వీర్యం చేశారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన సమయానికి 938 చికిత్సలు మాత్రమే ఆరోగ్యశ్రీ పరిధిలో ఉండేవి. వాటిని ఏడాది కాలంలోనే 2,436కు పెంచారు. అనంతరం వాటిని మరింత పెంచి 3,275 చికిత్సలకు విస్తరించారు. అంతే కాకుండా, వార్షిక చికిత్స వ్యయాన్ని తొలుత రూ.5 లక్షలకు.. ఆ తరువాత ఏకంగా రూ.25 లక్షలకు పెంచి, ప్రజలకు ఆరోగ్య భరోసాను అందించారు. అవసరాన్ని బట్టి ఇతర రాష్ట్రాల్లోని పెద్ద పెద్ద ఆస్పత్రుల్లో సైతం చికిత్స పొందే అవకాశం కల్పించారు. ఇటువంటి మహత్తర పథకాన్ని రద్దు చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీని వెనుక డాక్టర్ వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్ చేసిన మంచిని మరుగున పెట్టే కుట్ర ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

జిల్లాలో ఆరోగ్యశ్రీ వివరాలు

నెట్‌వర్క్ ఆస్పత్రులు	78
వీటిలో ప్రైవేటు	43
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	5
ప్రైమరీ హెల్త్ సెంటర్లు	28
జీజీహెచ్	1
ఏరియా ఆస్పత్రి	1
దంత వైద్య శాలలు (ఈహెచ్‌ఎస్)	16
ఆరోగ్యశ్రీ కార్డుదారులు	5,12,000

ఏం చేస్తున్నారంటే..

ఆరోగ్యశ్రీ పథకం పేరును కూటమి సర్కారు ఎన్టీఆర్ వైద్య సేవగా మార్చింది. అయినప్పటికీ జనం ఇప్పటికీ ఆరోగ్యశ్రీ గానే ఈ పథకాన్ని పిలుస్తున్నారు. దీనిని సహించలేని ప్రభుత్వం ఏకంగా ఈ పథకానికి మంగళం పాడేందుకు దాదాపు రంగం సిద్ధం చేసిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఆరోగ్యశ్రీ స్థానంలో ప్రభుత్వం ఆరోగ్య బీమా (హెల్త్ ఇన్సూరెన్స్) తీసుకుని వస్తోంది. దీనిని ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానం చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు 'ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన, ప్రధానమంత్రి వయో వందన యోజన' పేరుతో ప్రత్యేక కార్డుల రూపకల్పన ఇప్పటికే ప్రారంభమైంది. ఈ ప్రక్రియ జిల్లాలో ఇప్పటికే 85 శాతం పూర్తయింది. ఆయుష్మాన్ భారత్ అమలుపై ఉద్యోగులకు శిక్షణ సైతం పూర్తి చేశారు. త్వరలోనే ఇది అమలులోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఈ పరిణామం ఇటు ప్రజల్లో.. అటు ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల్లో ఆందోళన నింపుతోంది. కొత్త విధానం అమలులోకి వస్తే పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారే అవకాశం ఉందన్న విమర్శలు సర్వత్రా వస్తున్నాయి.



ఆయుష్మాన్ భారత్ కార్డు

చికిత్సల సంఖ్య కుదింపు!

ఆరోగ్యశ్రీలో ఏకంగా 3,275కు పైగా చికిత్సలు అందిస్తుండగా.. ఆయుష్మాన్ భారత్ పథకంలో ఈ సంఖ్య 1,900 లోపే ఉంటుంది. ప్యాకేజీ సైతం తక్కువగా ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రులు ఈ నూతన పథకంపై ఆసక్తి చూపడం లేదు. ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసి, దీని పరిధిలోకి రాని చికిత్సలను బీమా పరిధిలోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇదే కనుక జరిగితే ఇప్పటి వరకూ నయాపైసా కూడా చెల్లించకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం పొందుతున్న పేద, మధ్య తరగతి ప్రజలపై పెను భారం పడుతుంది. పైగా, ఇప్పటి వరకూ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రులకు నిధులు విడుదలవుతున్నాయి. ఆయుష్మాన్ భారత్ అమలులోకి వస్తే చికిత్స క్లెయిమ్‌కు అప్రూవల్ వచ్చాక కలెక్టర్ ద్వారా నిధులు విడుదల కానున్నట్లు సమాచారం. ఇది కూడా రోగులకు ఇబ్బందికరంగా మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

రూ.150 కోట్ల బిల్లులు పెండింగ్

ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసే యత్నాల్లో భాగంగానే నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు నిలిపివేసిందనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సుమారు రూ.150 కోట్ల మేర బిల్లులను సర్కారు నిలిపివేసింది.

'మిత్ర' ద్రోహం



ఆరోగ్యశ్రీ పథకం ఎత్తివేత యత్నాలపై ఆ విభాగంలోని ఉద్యోగులు మండిపడుతున్నారు. ఆరోగ్యశ్రీ స్థానంలో తీసుకుని వచ్చే నూతన పథకంలోకి వారిని తీసుకుంటారా లేక బీమా కంపెనీ ఉద్యోగులే నూతన పథకాన్ని అమలు చేస్తారా అనే విషయంలో ఇప్పటి వరకూ స్పష్టత లేదు. దీంతో, తమకు ఉద్యోగ భద్రత కరువైందని వారు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఆయుష్మాన్ భారత్ అమలు చేస్తే ఇప్పటి వరకూ కొనసాగుతున్న ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలో సేవలందిస్తున్న ఆరోగ్య మిత్రల భవితవ్యం ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. ఆయుష్మాన్ భారత్ అమలు లాగిన్‌ను సంబంధిత నెట్‌వర్క్ ఆస్పత్రిలోని మెడికో ద్వారా చేపడతారు. దీంతో ఆరోగ్య మిత్రల ఉనికి ప్రశ్నార్థకంగా మారనుంది. దీనిపై జిల్లా వ్యాప్తంగా 67 మంది ఆరోగ్య మిత్రలు ఆందోళన చెందుతున్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో..

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకం కింద 2023 వరకూ జిల్లా వ్యాప్తంగా రూ.508,49,95,571 వెచ్చించారు.
- 2,48,805 మందికి చికిత్స అందించారు.
- ఏటా రూ.50 కోట్లకు పైనే నిధులు ప్రజారోగ్యం కోసం ఖర్చు చేశారు.
- గుండె, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, క్యాన్సర్ వంటి ఖరీదైన చికిత్సలను సైతం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చారు.
- బైలాట్రల్ కాక్లియర్ ఇంప్లాంటేషన్‌కు రూ.11.97 లక్షలు, అల్లోజెనిక్ బోన్‌మ్యారో స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ (14 ఏళ్ల పైన) రూ.11 లక్షలు, గుండె మార్పిడికి రూ.10.77 లక్షల చొప్పున వెచ్చించారు. ఇటువంటి వ్యాధులకు సైతం ఆరోగ్యశ్రీలో నయా పైసా కూడా చెల్లించనవసరం లేకుండానే చికిత్స చేయించుకునే అవకాశాన్ని పేదలకు కల్పించారు.

ఆరోగ్యశ్రీ చికిత్సల వివరాలు

సంవత్సరం	చికిత్స పొందిన వారు	వెచ్చించిన (రూ.కోట్లు)
2019-20	25,750	62.71
2020-21	29,602	62.15
2021-22	47,039	89.48
2022-23	1,46,414	294.15

ఆ కాంట్రాక్టర్‌పై పీఎఫ్ అధికారులే కేసు పెట్టాలి

- తక్షణం కొత్త కాంట్రాక్టర్‌ను తీసుకోవాలి
- అన్నవరం దేవస్థానానికి న్యాయవాది సలహా!

అన్నవరం: ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) చెల్లించినట్లు నకిలీ చలానాలు ఇచ్చిన విజయవాడకు చెందిన కనకదుర్గా మ్యాన్‌పవర్ సర్వీసెస్ శానిటేషన్ కాంట్రాక్టర్‌పై పీఎఫ్ అధికారులే కేసు పెట్టాల్సి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నకిలీ పీఎఫ్ చలానాల బాగోతంపై తీసుకోవాల్సిన చర్యలపై దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, శానిటేషన్ విభాగం అధికారులు న్యాయవాదిని సలహా అడిగారు. మార్చిలోనే సిబ్బంది ఖాతాలో పీఎఫ్ జమ చేయకపోతే అప్పట్లోనే సిబ్బంది కాంట్రాక్టర్‌కు ఆ విషయం తెలియజేయాలి. అతడి నుంచి ఎటువంటి సమాధానమూ రాకపోతే దేవస్థానానికి ఆ విషయం లిఖితపూర్వకంగా తెలపాలి. అప్పుడు దేవస్థానం అధికారులకు చర్య తీసుకునే అధికారం ఉండేది. అలా జరగలేదు కాబట్టి ఆ కాంట్రాక్టర్‌పై దేవస్థానం క్రిమినల్ చర్య తీసుకోవడం అంత సులువు కాదని న్యాయవాది చెప్పినట్లు సమాచారం. కాకపోతే నకిలీ పీఎఫ్ చలానాలు సృష్టించి, మోసం చేశారంటూ పీఎఫ్ అధికారులకు దేవస్థానం ఫిర్యాదు చేసి వారితో ఆ కాంట్రాక్టర్‌పై కేసు పెట్టవచ్చని సమాచారం. అదే సమయంలో ఆ కాంట్రాక్టర్‌ను తొలగించాలని న్యాయవాది సూచించినట్లు తెలుస్తోంది. షార్ట్ టెండర్ ద్వారా కొత్త కాంట్రాక్టర్‌ను ఎంపిక చేయాలని చెప్పినట్టు చెబుతున్నారు.

టెండర్ పిలవకుండానా?

దేవస్థానంలో చెత్త ట్రాక్టర్ నిర్వహణకు టెండర్ పిలిచారు. అదే విధంగా సత్రాల్లో దుప్పట్లు, కర్టెన్ల వంటివి ఉతికి, ఇస్త్రీ చేయడానికి కూడా టెండర్ పిలిచారు. చిన్నచిన్న వాటికే టెండర్లు పిలుస్తున్నప్పుడు ప్రతి నెలా 350 మంది సిబ్బందిని సరఫరా చేసే కాంట్రాక్టుకు టెండర్ పిలవకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేవస్థానంలో ఎటువంటి డిపాజిట్ లేకుండా, టెండర్ పిలవకుండా నామినేషన్ పద్ధతిలో కనకదుర్గా మ్యాన్‌పవర్ సర్వీసెస్‌కు శానిటేషన్ కాంట్రాక్ట్ కట్టబెట్టడమే ఈ నకిలీ వ్యవహారానికి దారి తీసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తం 350 మంది పారిశుధ్య సిబ్బందికి కార్మిక చట్టాల ప్రకారం జీతాలిచ్చేందుకు దేవస్థానం నెలకు రూ.59 లక్షలు చెల్లించేలా ఆ సంస్థతో ఒప్పందం కుదిరింది. ప్రతి నెలా దేవస్థానం 13 శాతం, సిబ్బంది వాటాగా 12 శాతం వసూలు చేసి పీఎఫ్ చెల్లించి, ఆ రసీదులు జమ చేస్తే దేవస్థానం బిల్లు ఇవ్వాలి. కానీ మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ఆ సంస్థ ఫేక్ రసీదులు ఇచ్చి, సుమారు రూ.1.77 కోట్ల మేర బిల్లులు పొందింది. సిబ్బంది ఖాతాల్లో పీఎఫ్ జమ కాకపోవడంతో అనుమానం వచ్చిన అధికారులు నిలదీయడంతో మూడు నెలలకు కలిపి పీఎఫ్‌కు సుమారు రూ.30 లక్షలు జమ చేసి కొత్త రశీదులు అందజేశారు.



అన్నవరం దేవస్థానం

కొత్త కాంట్రాక్ట్‌కు మరింత సమయం!

మరోవైపు రాష్ట్రంలోని ప్రముఖ దేవస్థానాలన్నింటికీ కలిపి ఒకే శానిటేషన్ కాంట్రాక్ట్‌కు పిలిచిన టెండర్ ఖరారుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఈలోపు దేవస్థానంలో శానిటేషన్ నిర్వహణను షార్ట్ టెండర్ ద్వారా కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రసీదుల తనిఖీపై సూచనలు

పీఎఫ్ రసీదులు ఒరిజనల్ లేక ఫేక్ అనే విషయం తెలుసుకోవాలనే అంశంపై దేవస్థానం సిబ్బందికి పీఎఫ్ అధికారులు శనివారం అవగాహన కల్పించారు. ఈఓ సుబ్బారావు కోరిక మేరకు కాకినాడ పీఎఫ్ ఆఫీసుకు చెందిన ఇద్దరు అధికారులు రసీదుపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం, గూగుల్‌లో పీఎఫ్ వెబ్‌సైట్‌లో తనిఖీ చేయడం వంటివి వివరించారు.

పొగాకు నారుమడులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



జీఎల్‌కే ప్రసాద్

దేవరపల్లి: పొగాకు నారు మడులు వేయడానికి సిద్ధమవుతున్న రైతులు తప్పనిసరిగా టుబాకో బోర్డులో రిజిస్ట్రేషన్ చేయించుకుని రసీదు పొందాలని రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ సూచించారు. వారికి మాత్రమే సీటీఆర్ఐ, ఐటీసీ సంస్థలు విత్తనాలు సరఫరా చేస్తాయని తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పంట నియంత్రణలో భాగంగా నర్సరీ దశ నుంచే నిబంధనలు కఠినతరం చేస్తున్నామని తెలిపారు. వాణిజ్య రైతులు రెండు హెక్టార్ల వరకూ విస్తీర్ణంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. నర్సరీలను ప్రత్యేక అధికారుల బృందం తనిఖీ చేస్తుందని, ఆ సమయంలో రైతులు రసీదు చూపించాలని చెప్పారు. పొగాకు సాగు చేసే రైతులు విధిగా రిజిస్ట్రేషన్ ఉన్న నర్సరీల నుంచి నారు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. పొగాకు నాట్ల సమయంలో బోర్డు అందిస్తున్న ఫారం-2తో పాటు నారు అమ్మిన నర్సరీ యజమాని ఇచ్చిన రసీదును జత చేసి, అధికారులకు అందజేయాలన్నారు. బోర్డు రిజిస్ట్రేషన్ లేకుండా నర్సరీలు వేసే వారిపై చర్యలు తీసుకుంటామని ప్రసాద్ చెప్పారు. నర్సరీలను రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల జాబితాను బోర్డు వద్ద ప్రదర్శిస్తామన్నారు. అంతర్జాతీయంగా వర్జీనియా పొగాకు విలువ పెరగాలంటే ఉత్పత్తి తక్కువగా ఉండాలన్నారు. రైతులు ఎక్కువగా ఎల్‌వీ-7, ఎ-3 వంగడాలు సాగు చేస్తున్నారని, కొత్తగా సీటీఆర్ఐ ఎఫ్‌సీజే-11 వంగడం అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ లేని నర్సరీల నుంచి నారు కొనుగోలు చేసి, పొగాకు సాగు చేస్తే బ్యారన్ రిజిస్ట్రేషన్ నిలుపు చేస్తామని ప్రసాద్ చెప్పారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: రత్నగిరికి శనివారం భక్తులు పోటెత్తారు. సత్యదేవుని సుమారు 20 వేల మంది దర్శించుకున్నారు. ఉదయం నుంచీ భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంత మండపాలు రద్దీగా మారాయి. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. స్వామివారి వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. సత్యదేవుని ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు.

స్థానచలనం లేని వేతనం

- బదిలీలు, పదోన్నతులు సరే
- ఉపాధ్యాయులకు అందని జీతాలు
- పొజిషన్ ఐడీలు రాక అగచాట్లు
- ఉమ్మడి జిల్లాలో 1,500 మందిపై ప్రభావం

రాయవరం: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ముగిశాయి.. ఇందులో పలువురికి పొజిషన్ ఐడీలు రాకపోవడంతో జీతభత్యాలు నిలిచిపోయాయి. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 1,500 మందికి ఇబ్బందులు ఎదురయ్యాయి. సాధారణంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు వారు బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా అక్కడి డీడీఓకు సమాచారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గతంలో రెగ్యులర్ జీతాలు తీసుకుంటున్నప్పటికీ వీరి స్థానం మారడంతో ఏ స్థానానికి బదిలీ అయ్యారో ఆ స్థానానికి సంబంధిత ఉద్యోగికి పొజిషన్ ఐడీ కేటాయించాలి. అది జరిగితేనే సీఎఫ్ఎంఎస్‌లో వారి వివరాలు డిస్‌ప్లే అవుతాయి. అప్పుడు మాత్రమే వేతనాలు చెల్లించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 6,533 మంది ఉపాధ్యాయులను బదిలీ చేశారు. గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు 178 మందికి, మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా 284 మందికి, స్కూల్ అసిస్టెంట్, సమాన స్థాయి కేడర్ ఉపాధ్యాయులుగా 3,298 మందికి, సెకండరీ గ్రేడ్, సమాన స్థాయి కేడర్ ఉపాధ్యాయులుగా 2,995 మందికి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు 32 మందికి, ఆర్ట్/డ్రాయింగ్/క్రాఫ్ట్/మ్యూజిక్ /ఒకేషనల్ ఉపాధ్యాయులు 20 మందికి స్థాన చలనం కలిగింది. జూన్ 15వ తేదీ నాటికి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తయ్యింది. కొత్తగా ఏర్పడిన మోడల్ ప్రైమరీ స్కూల్స్‌కు పలువురు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు బదిలీ అయ్యారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలు కొత్తగా ఏర్పడడంతో ఇక్కడకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించాల్సి ఉంది. అయితే బదిలీలు జరిగి నెల కావొస్తున్నా నేటికీ అధిక శాతం ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించలేదు. ఫలితంగా జూలైలో తీసుకోవాల్సిన జూన్ నెల జీతాలు వీరికి మంజూరు కాలేదు. వేతనాలు రాకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా జీతాల బిల్లులు ప్రతి నెలా 25వ తేదీ లోపు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసి, ట్రెజరీకి బిల్లు సమర్పించాలి. ఈ నెల 25వ తేదీ లోపు పొజిషన్ ఐడీలు రాకుంటే జూలై జీతం కూడా వీరు పొందలేని పరిస్థితి నెలకొంటుంది. పలు ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర స్థాయిలో పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నా నేటికీ పూర్తి స్థాయిలో పొజిషన్ ఐడీలు క్రియేట్ కాలేదు.

సమస్యలు ఎక్కడెక్కడంటే..

గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117కు వ్యతిరేకంగా ప్రస్తుత ప్రభుత్వం జీవో 21ను తీసుకువచ్చింది. ఆరు రకాల పాఠశాలల స్థానంలో ఇప్పుడు తొమ్మిది రకాల పాఠశాలలు ఏర్పడ్డాయి. ఇందులో ముఖ్యంగా మోడల్ ప్రైమరీ స్కూల్స్, అప్‌గ్రేడ్ అయిన యూపీ స్కూల్స్‌లో కొత్తగా ఉపాధ్యాయుల నియామకం జరిగింది. ఈ పాఠశాలలకు కొత్తగా పోస్టులు మంజూరు కావడంతో ఆ స్థానాలకు బదిలీ పొందిన వారికి పొజిషన్ ఐడీలు కేటాయించాల్సి ఉంది. మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో అప్పటి వరకూ అదే స్కూల్ పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అప్పటికే పొజిషన్ ఐడీలు ఉండడంతో వారికి వేతనాలు చెల్లించారు. ఇదే పాఠశాలలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు రాకపోవడంతో వేతనాలు పొందలేని పరిస్థితి నెలకొంది. అలాగే ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల్లో డీడీఓ మారడంతో అక్కడ ఏ ఒక్కరికీ జీతభత్యాలు రాని పరిస్థితి ఉంది. సాధారణంగా జూన్ నెలలో ప్రతి కుటుంబంలో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో పిల్లల స్కూల్ ఫీజులు, విద్యా సామగ్రి కోసం రూ.వేలల్లో వెచ్చించాల్సి ఉంటుంది. బ్యాంకు రుణాలు తీసుకున్న వారు నెలవారీ ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించాలి. అలాగే బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లేందుకు రవాణా ఖర్చులు, ఇంటి అద్దెలు, అడ్వాన్సుల రూపంలో మరింత ఖర్చు పెరిగిందని, ఈ నేపథ్యంలో జీతాలు రాకపోవడం ఇబ్బంది కలుగుతుందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్లు (ఫైల్)

సమస్యను పరిష్కరించాలి



పొజిషన్ ఐడీలు వెంటనే కేటాయించక పోవడంతో బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో కొందరు జీతాలు పొందలేక పోయారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు చెల్లించేందుకు, కుటుంబ ఖర్చులకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి.

– మేడిచర్ల త్రివెంకట ఆది సత్య సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్, కోనసీమ

ఈ నెల జీతాలైనా వస్తాయా!



రాష్ట్ర వ్యాప్తంగా 72 వేల మంది ఉపాధ్యాయులు పొజిషన్ ఐడీలు రాక జూన్ నెల లేక జీతాలు పొందలేకపోయారు. జూలై నెల జీతాల బిల్లు సబ్మిట్ చేసే సమయం ఆసన్నమవడంతో ఈ నెల జీతాలు వస్తాయా? రావా? అన్న మీమాంసలో ఉన్నారు. పొజిషన్ ఐడీలు వెంటనే కేటాయించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– ఎస్ఎస్ పల్లంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్టీయూ, కోనసీమ

ప్రభుత్వం చర్యలు చేపట్టాలి



పొజిషన్ ఐడీలు రాక ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయుల విషయంలో ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి. జూన్, జూలై నెలలకు సంబంధించి వేతనాలు చెల్లించేందుకు ప్రత్యేక ఉత్తర్వులు ఇవ్వాలి. ఇప్పటికే ఒక నెల వేతనం రాక ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయుల ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలి.

– చింతాడ ప్రదీప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, పీఆర్‌టీయూ, కాకినాడ జిల్లా

క్లుప్తంగా

ప్రభుత్వ అరాచకాలపై ప్రశ్నించరెందుకు?

ఎమ్మెల్సీ వీర్రాజుపై ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ధ్వజం



అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న మీరు రాష్ట్రంలో చంద్రబాబు అండ్ కో చేస్తున్న అరాచకాలు, కక్ష సాధింపు చర్యలపై ఎందుకు నోరు మెదపడం లేదని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజును ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎమ్మెల్సీ వీర్రాజు చేసిన వ్యాఖ్యలను ఇజ్రాయిల్ ఖండించారు. అమలాపురంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి సోము వీర్రాజుకు లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై దుర్భాషలాడినప్పుడు ఇదే వీర్రాజు ఏమైపోయారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రస్తుతం మహిళలు, బాలికలపై అత్యాచారాలు రోజురోజుకూ పెరుగుపోతుంటే మీరు చోద్యం చూస్తున్నారా...? అని ధ్వజమెత్తారు. ఇప్పుడు రాష్ట్రంలో బెల్ట్ షాపులు పెట్టి, మద్యం అధిక ధరలకు విక్రిస్తున్నా, వాస్తవాలు ఆయనకు కనిపించక పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.1.75 లక్షల కోట్ల అప్పులు చేసిన చంద్రబాబు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా, ఏ విధంగా ఆ నిధులు ఖర్చు చేశారో లెక్కలు అడిగే దమ్ము వీర్రాజుకు ఉందా...? అని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ప్రశ్నించారు.

ప్రతిభకు పరీక్ష..

- 6 నుంచి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు అవకాశం
- విద్యార్థి విజ్ఞాన్ మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు తుది గడువు సెప్టెంబర్ 30



రాయవరం: విద్యార్థుల్లో సృజనాత్మకతను ఆవిష్కరణల వైపు మళ్లించేందుకు బాట పడుతుంది. పరిశోధన, ప్రయోగాల్లో వారు రాణించేలా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) పేరుతో జాతీయ స్థాయి ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. దీనిని కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం మరియు విజ్ఞాన భారతిలు సంయుక్తంగా జరుపుతున్నాయి. దేశంలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్న వారికి ఈ పరీక్ష ఉంటుంది. ప్రతిభ చాటిన వారికి భారతదేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం ఉంది. విద్యార్థి విజ్ఞాన మంథన్‌ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా, సెప్టెంబర్ 30 వరకూ గడువు ఉంది. ఈ ప్రవేశ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులకు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్, మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాలతో ఏదైనా ఒక దాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన అప్లికేషన్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశముంది.

విభాగాలు.. మార్కులు

ఈ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6 నుంచి 11 తరగతులకు విడివిడిగా ఈ పరీక్ష ఉంటుంది. ఇందులో తెలుగు, హిందీ, ఇంగ్లిషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష జరుపుతారు. ఈ పరీక్షకు సంబంధించి మాక్ పరీక్షలను సెప్టెంబర్ 1 నుంచి నిర్వహిస్తారు. పాఠశాల స్థాయి ప్రధాన పరీక్ష అక్టోబర్ 28 నుంచి 30 తేదీల వరకూ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైన వారికి లెవిల్ 2, ద్వితీయ పరీక్ష ఆన్‌లైన్‌లో ప్రొక్టరింగ్ విధానంలో పరిశీలకుల సమక్షంలో నవంబర్ 19న ఉంటుంది. పై రెండు పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్య కాలంలో 90 నిమిషాల పాటు (గంటన్నర) రాయాల్సి ఉంటుంది. లెవిల్ -1 ప్రధాన పరీక్షలో ప్రతి తరగతికి సంబంధించిన 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు వంతున 100 మార్కులు కేటాయిస్తారు. సెక్షన్ -ఏలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి 20 ప్రశ్నలు (20 మార్కులు), సత్యేంద్రనాథ్ బోస్ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు (20 మార్కులు), సెక్షన్ బీలో 6 నుంచి 11 తరగతులకు సంబంధించి విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు (50 మార్కులు), లాజిక్, రీజనింగ్ 10 ప్రశ్నలు (10 మార్కులు) ఉంటాయి. ఇందులో ఉత్తీర్ణులైన వారికి లెవిల్- 2 ద్వితీయ పరీక్షలో 50 ప్రశ్నలు 100 మార్కులకు ఉంటాయి.

జాతీయ స్థాయి పోటీలకు ఇలా..

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల చొప్పున 12 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల వంతున 18 మందిని జాతీయ స్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలతో పాటు మెమెంటో, ప్రశంసా పత్రంతో పాటు నెలకు రూ.2 వేల చొప్పున సంవత్సరం పాటు భాస్కర ఉపకార వేతనం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2025-26లో జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్డీఓ, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్సీ మొదలైన ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1-3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారిలా..

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 25 మందిని ఎంపిక చేస్తారు. 6-11 తరగతులకు గాను మొత్తం 150 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు వంతున మొత్తం 18 మందిని జాతీయ స్థాయికి అర్హత పొందుతారు.

రాష్ట్ర స్థాయి పరీక్ష డిసెంబర్ 21 లేదా 28 లేదా జనవరి 4 తేదీల్లో ఏదో ఒకరోజు పరీక్ష రాయాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలతో పాటు మెమెంటో, సర్టిఫికెట్ అందజేస్తారు.

వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి..



పరీక్ష రాయడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వీవీఎం.ఓఆర్‌జీ.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ కావచ్చు. ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పోటీతత్వాన్ని పెంచుకునేందుకు ఈ పరీక్ష దోహదపడుతుంది.

-డాక్టర్ షేక్ సలీం బాషా,
జిల్లా విద్యాశాఖాధికారి,
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ

నరసన్న దేవస్థానానికి వెలుగులు

సాక్షి ఇంపాక్ట్

కోరుకొండ: ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వెలుగులు వచ్చాయి. కొంతకాలంగా స్వామివారి కొండపై వెలుగులు దూరమయ్యాయి. రాత్రిళ్లు దర్శన భాగ్యం కలగక భక్తులు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల సాక్షి దినపత్రికలో నిశీధిలో నరసన్న అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి అన్నవరం దేవస్థానం అధికారులు స్పందించి కోరుకొండ స్వామివారి ఆలయానికి విద్యుత్ వెలుగులు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. నారసింహుని దేవస్థానంలో కింద నుంచి కొండపైకి లైట్లు ఏర్పాటు చేయడంతో స్వామివారి గోపుర దర్శనం భక్తులకు ప్రాప్తించింది. దీనితో భక్తులు సంతోషిస్తున్నారు.



స్వామివారి కొండపైకి ఏర్పాటు చేసిన లైట్లు

బాలికపై అత్యాచారయత్నం

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలో ఓ బాలిక (6)పై 14 ఏళ్ల బాలుడు అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి ఎస్ఐ సీహెచ్ రాజేష్ కథనం ప్రకారం.. ఎస్.యానంలో రెండు రోజుల కిందట తన కుమార్తెపై పక్కింటికి చెందిన బాలుడు అత్యాచార యత్నం చేసినట్టు ఆ బాలిక తల్లి శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి శనివారం సంఘటనా స్థలానికి డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ డి.ప్రశాంత్‌కుమార్ వెళ్లి దర్యాప్తు జరిపారు. ఆ బాలికను వైద్య పరీక్షల నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ రాజేష్ వివరించారు.

రుణాల రికవరీకి చర్యలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘం పరిధిలో గతంలో ఎన్ఎస్ఎఫ్‌డీసీ/ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాల ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారుల నుంచి ప్రతి నెలా రూ.1.30 కోట్ల రికవరీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘ కార్యనిర్వాహక సంచాలకులు జె.సత్యవతి శనివారం తెలిపారు. జాతీయ షెడ్యూల్ కులాల కార్పొరేషన్, జాతీయ సఫాయికర్మచారీల ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ పథకాల కింద 2015-16, 2018-19 సంవత్సరాల్లో రుణాలు మంజూరు చేశామన్నారు. రుణాలు పొందిన లబ్ధిదారులు, రుణ మొత్తాలను ఇంత వరకూ సక్రమంగా ప్రభుత్వానికి తిరిగి జమ చేయలేదన్నారు. ఇప్పుడు రాష్ట్ర షెడ్యూల్ కులాల సహకార ఆర్థిక సంఘం లిమిటెడ్ రుణాల వసూలుకు నిర్దిష్ట లక్ష్యాలను ఆదేశించిందన్నారు. దీని ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రతి నెలా లబ్ధిదారుల నుంచి రూ.1.30 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారన్నారు. వెంటనే లబ్ధిదారులు రుణ బకాయిలు మొత్తం చెల్లించాలని కోరారు. లేని పక్షంలో బకాయిలను లబ్ధిదారుల నుంచి లేదా వారి హామీదారుల నుంచి వసూలు చేసేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బాంబు పేలుళ్లు

- ఎగిరిపడిన బండరాళ్లు
- ఇద్దరు మహిళలకు గాయాలు

తుని: పోలవరం ఎడమ ప్రధాన కాలువ తవ్వకం పనుల్లో భాగంగా వినియోగిస్తున్న బాంబు పేలుళ్లకు బండరాళ్లు ఎగిరిపడి తుని పట్టణం ఒకటో వార్డు డ్రైవర్స్ కాలనీలోని ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం కత్రాళ్లకొండ తవ్వకానికి కాంట్రాక్టు సిబ్బంది బాంబులు పేల్చారు. దీంతో బండరాయి ఎగిరి గృహాల మధ్య పడింది. ఈ సంఘటనలో ఓ ఇంటి ప్రహరీ ధ్వంసం కావడంతో పాటు శాంతి, వీరమ్మ అనే ఇద్దరు మహిళలు గాయపడ్డారు. వీరిని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రాత్రి పగలు బాంబుల పేలుళ్లతో ఇళ్ల మధ్య కంపనాలు రావడంతో భయాందోళనకు గురవుతున్నామని కాలనీ వాసులు అంటున్నారు. అధికారులు స్పందించి జన జీవనానికి అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బాంబు పేలుళ్ల ధాటికి ధ్వంసమైన ఇంటి ప్రహరీ



బండరాయి దూసుకురావడంతో గాయపడిన మహిళ

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 - 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 - 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,500
గటగట (వెయ్యి)	27,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	25,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 - 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 - 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

రక్తమోడిన రహదారి

- 216 జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం
- ఇద్దరి మృతి, మహిళ తల తెగిపడిన వైనం

ముమ్మిడివరం: జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది.. ఆ ప్రాంతం భయానకంగా మారింది.. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి శివారు లక్ష్మీదేవిలంక 216 జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు, మహిళ మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. ముమ్మిడివరం నుంచి మురమళ్లకు ముగ్గురు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో యానాం వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయే సమయంలో యానాం నుంచి మోటార్ సైకిల్‌పై వస్తున్న పశ్చిమగోదావరి జిల్లా దిరుసుమర్రు శివారు పల్లిపాలేనికి చెందిన బొడ్డు రాంబాబు (24) ఆటోను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐ.పోలవరం మండలం కేశనకుర్రుకు చెందిన పచ్చిమాల లక్ష్మి (49) అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఆమె మెడపై నుంచి వెళ్లింది. ఆమె తల తెగి మూడు మీటర్ల దూరంలో పడిపోయింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన రాంబాబును జాతీయ రహదారి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. రాంబాబు ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ శనివారం ఉదయం డ్యూటీ దిగి స్వగ్రామం దిరుసుమర్రు శివారు పల్లిపాలెం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు సీఐ ఎం.మోహన్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద స్థలంలో మోటారు సైకిల్

నలుగురు యువకుల అరెస్ట్

950 గ్రాముల గంజాయి స్వాధీనం

మామిడికుదురు: నగరం గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు శనివారం దాడి చేసి నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 950 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ కథనం మేరకు... నగరం గ్రామంలోని ఈదరాడ రోడ్డులో మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు సమాధి వద్ద గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం వచ్చింది. అక్కడకు వెళ్లగా అనుమానాస్పదంగా కనిపించిన యానాంకు చెందిన కనపర్తి వెంకట దుర్గ, పెద్దిరెడ్డి గోవిందరాజు, పల్లం గ్రామానికి చెందిన పెమ్మాడి నాగూర్, పుచ్చల్లంక గ్రామానికి చెందిన యన్నాబత్తుల వెంకట్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా 950 గ్రాముల గంజాయి దొరికింది. నలుగురిని అరెస్టు చేసి గంజాయిని సీజ్ చేశామని ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు. వారిని రిమాండు నిమిత్తం రాజోలు కోర్టుకు తరలించామని చెప్పారు.



గంజాయి కేసులో నలుగురు నిందితులను చూపుతున్న పోలీసులు

తండ్రిపై దాడి చేసిన తనయుడి అరెస్ట్

రాయవరం: స్థానిక రాజరాజేశ్వరి కాలనీలో తండ్రిపై సుత్తితో దాడి చేసిన తనయుడిని శనివారం అరెస్ట్ చేసినట్లు రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు విలేకరులకు తెలిపారు. ప్రతి రోజు తండ్రి గంటా శ్రీనివాస్ తిడుతున్నాడని, కోపం పెంచుకున్న కొడుకు పవన్ కళ్యాణ్ ఈ నెల 17వ తేదీ రాత్రి దాడి చేశాడు. మండపేట సీఐ పి.దొరరాజు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టి, నిందితుడు పవన్‌కళ్యాణ్‌ను అరెస్ట్ చేసి అనపర్తి జేఎఫ్‌సీఎం ముందు హాజరు పర్చగా నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.



నిందితుడిని అరెస్ట్ చూపిస్తున్న ఎస్సై సురేష్‌బాబు, సిబ్బంది

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేశామని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ మోహనరావు శనివారం తెలిపారు. ఆ వివరాల్లోకెళితే.. తుని పట్టణం మార్కండరాజుపేటకు చెందిన తాపీ మేస్త్రి కోరాడ కుమార్ (52)ను స్థానిక ఎల్ఐసీ బిల్డింగ్ ఎదురుగా మూతపడిన రైల్వే గేటు వద్ద ఓ రైలు ఢీకొంది. దీంతో కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.



కుమార్ (ఫైల్)